క్లుప్తంగా

పింఛన్ల పునఃపరిశీలన

కమలాపురం : మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక పింఛన్ల పునః పరిశీలన చేశారు. బుధవారం టి.చదిపిరాళ్ల తదితర గ్రామాలలో మంచానికే పరిమితమై రూ.15వేల పింఛన్లు పొందుతున్న వారిని వైద్య బృందంతో కలసి ఎంపీడీఓ జ్యోతి పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మాత్రమే పింఛన్ల పునఃపరిశీలన చేస్తున్నామని ఎంపీడీఓ తెలిపారు. అర్హులైన వారి పింఛనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె వివరించారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

జమ్మలమడుగు రూరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిరుద్యోగ యువతి, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి విజయ వినీల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవికుమార్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఎయిల్ డిక్సన్ కంపెనీలు వస్తున్నట్లు వారు తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ ఆపైన చదువుకున్న వారు తమ బయోడేటాతో పాటు సర్టిఫికెట్లను తీసుకుని జాబ్ మేళాకు హాజర్ కావాలని వారు తెలియజేశారు. యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. వివరాలకు 9000479991 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు

ఎర్రగుంట్ల : ముద్దనూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం విద్యాశాఖ అధికారి, పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయ రెడ్డి పరిశీలించి మాట్లాడారు. పాఠశాలకు పీఎంశ్రీ నిధుల కింద రూ.5 లక్షలు మంజూరు అయిందన్నారు. అందులో భాగంగానే పాఠశాల క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్, హాకీ కోర్టును ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో ఈ క్రీడా మైదానంలో జాతీయస్థాయి హాకీ పోటీలు, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయన్నారు. ఈ నిధులను ఈ ఐదేళ్లల్లో పాఠశాలలోని అభివృద్ధి కోసం ఏప్పుడైన వాడుకోవచ్చునన్నారు. ప్రస్తుతం 400 మీటర్ల వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫోటోలు:

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

కమలాపురం : కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజుపాళెం సుబ్బారెడ్డి సన్మానించారు. ఇటీవల మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజుపాళెం సుబ్బారెడ్డి జిల్లా వైస్‌ప్రెసిడెంట్‌గా ఎన్నిక చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం కమలాపురం పార్టీ కార్యాలయానికి వచ్చిన రవీంద్రనాథ్ రెడ్డిని ఆయన శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు.

ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలి


పులివెందుల రూరల్ : లింగాల, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లోని వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పులివెందుల రూరల్ సీఐ రమణ తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వానాదారులు తప్పనిసరిగా అధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు.

300 మందికి కంటి పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న విద్యార్థినులతో పుష్పగిరి ఆసుపత్రి సిబ్బంది

కమలాపురం : స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన 300 మంది విద్యార్థినులకు పుష్పగిరి వైద్య సిబ్బంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం స్థానిక ఆ పాఠశాలలో భారతి సిమెంట్ వారి సౌజన్యంతో పుష్పగిరి ఆసుపత్రి సిబ్బంది పర్యవేక్షణలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు మనోజ్ కుమార్, వెంకటేష్ తదితరులు 300 మంది విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో అద్దాలు అవసరమైన 50 మందికి కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ప్లాస్టిక్ సర్జరీ ఒపీనియన్, మెల్ల కన్ను ఒపీనియన్ కోసం కడపలోని పుష్పగిరి ఆసుపత్రికి రెఫర్ చేశారు. మరి కొంత మందికి సైక్లోరీప్రాక్షన్ కోసం స్థానిక క్రాస్‌రోడ్డు లోని పుష్పగిరి కంటి పరీక్షా కేంద్రానికి తరలించి వై ద్య సేవలు అందించారు. కాగా కంటి వైద్య శి బిరం నిర్వహించి, 300 మందికి పరీక్షలు చేసి 50 మందికి అద్దాలు పంపిణీ చేయడంతో పా ఠశాల హెచ్‌ఎం సరస్వతి భారతి సిమెంట్స్‌కు, పుష్పగిరి సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అదృశ్యంపై కేసు నమోదు


అదృశ్యమైన గగ్గుటూరు బ్రహ్మయ్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని పెద్దకాంపల్లి గ్రామానికి చెందిన గగ్గుటూరు బ్రహ్మయ్య ఈనెల 3వ తేది నుంచి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పశువులు మేపుకోవడానికి వెళ్లి అదృశ్యమైనట్లు కుమారుడు గంగరాజు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు.

పండుగకు పప్పన్నం లేనట్లే..!

- ప్రభుత్వం నుంచి అందని కందిపప్పు
- టీడీపీ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న పేదలు


వేంపల్లె రేషన్ షాపులో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్న దృశ్యం

వేంపల్లె : తెలుగువారికి పెద్ద పండుగ అయిన సంక్రాంతికి పేద ప్రజలు పప్పన్నం తినలేని పరిస్థితి ఏర్పడింది. మరో కొద్దిరోజుల్లో సంక్రాంతి పండుగ వస్తుండటంతో ప్రతి ఒక్కరూ పప్పన్నం తినాలని ఆశతో తమకు చక్కరతోపాటు కందిపప్పు కావాలని అడుగుతున్నారు. వేంపల్లె మండల వ్యాప్తంగా 31 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అందులో 21వేలకు పైగా కార్డుదారులు ఉన్నారు. అయితే పౌర సరఫరాల శాఖ గోడౌన్‌లో సరఫరా లేకపోవడంతో రేషన్ డీలర్లు చేతులెత్తేశారు.

తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభు త్వం అందించే కందిపప్పు కోటాలో సరఫరా నిలిపేసింది. దీంతో తెల్ల రేషన్ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో కంది పప్పు అందలేదు. మార్కెట్లో కిలో కందిపప్పు రూ.170లు పలుకుతున్నా వేల కార్డుదారులకు రాయితీపై కిలో రూ.67లకు అందిస్తామంటూ ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచినా రేషన్ కంది పప్పు, వంటనూనె కార్డుదారులకు సక్రమంగా సరఫరా చేయడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. జనాన్ని మభ్యపెట్టడం అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను విస్మరించడం టీడీపీ అధినేత చంద్రబాబుకు కొత్తేమి కాదంటూ పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికీ ఒక్క హామీని కూడా కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదని పలువురు అంటున్నారు.

తలలు పట్టుకుంటున్న అధికారులు, డీలర్లు

ప్రభుత్వం గత ఏడు నెలల నుంచి రేషన్ దుకాణాలకు అరకొరగా కందిపప్పును సరఫరా చేస్తుండటంతో అటు అధికారులు, ఇటు డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. సంక్రాంతి పండుగ దగ్గరికి వస్తున్న నేపథ్యంలో రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులు కంది పప్పు కోసం క్యూ కడుతున్నారు. అరకొర పంపిణీ అనంతరం స్టాక్ అయిపోయిందంటూ డీలర్లు చేతులెత్తేశారు. కొందరు డీలర్లు అసలు పంపిణీ చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో టీడీపీ ప్రభుత్వం తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ డీలర్లతో వాగ్వేదానికి దిగిన సంఘటనలు ఉన్నాయి. జగనన్న పాలనలో ప్రతి ఒక్క కార్డుదారునికి బియ్యం, చక్కెర, గోధుమపిండి, జొన్నలు, రాగులు పంపిణీ చేసిన విషయాన్ని వారు గుర్తు చేసుకుంటున్నారు.

సల సల కాగుతున్న నూనె

సంక్రాంతి పండుగకు ప్రతి ఒక్కరూ అరిసెలు, చక్రాలు, పిండి వంటలు చేసుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో వ్యాపారులు నూనె ధరను అమాంతం పెంచారు. కంపెనీని బట్టి లీటరు నూనె రూ.130ల నుంచి రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతి పండుగకు పిండివంటలు చేసుకుని తినడం కూడా కష్టమేనని పేద ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ధరలు తగ్గించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండటంతో నిత్యవసరాలు వస్తువులు దీపావళి టపాసుల ఆకాశాన్ని అందుతున్నాయని విమర్శిస్తున్నారు.

మాకు కందిపప్పు ఇవ్వాలి



ఈ నెలలో సంక్రాంతి పండుగ ఉన్నందున ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలి. అలాగే సామాన్య ప్రజలకు కూడా కిలో కందిపప్పు ఇస్తే బాగుంటుంది. బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.170ల వరకు ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి అందరికీ కందిపప్పు ఇవ్వాలని కోరుతున్నాం.

– కటిక.కృష్ణవేణి(రేషన్ లబ్ధిదారురాలు), పాతపేట, వేంపల్లె

ఈనెల సరఫరా చేయలేదు



ప్రభుత్వం ఈనెల కందిపప్పును గొడన్లకు సరఫరా అందలేదు. గత ఆరు నెలలు సరఫరా ఉన్నంతవరకు కార్డుదారులందరికీ ఇవ్వాలని ఆదేశించాం. ఈనెల స్టాక్ లేనందున ఇవ్వలేకపోయాం. వచ్చేనెల కందిపప్పు అందేలా చర్యలు తీసుకుంటాం . కందిపప్పు తీసుకెళ్లిన డీలర్లందరూ కార్డుదారులకు స్టాక్ ఉన్నంతవరకు కంది పప్పు ఇవ్వాల్సిందే.

– హరినాథ్ రెడ్డి(మండల తహసీల్దార్), వేంపల్లె

పొలాల్లో వయ్యారిభామ నియంత్రణపై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో బుధవారం ఫుడ్అండ్ సైన్స్, టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పొలాల్లో వయ్యారిభామ కలుపు మొక్క నియంత్రణపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు వైద్య శిబిరం నిర్వహించి డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డిచే ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కులాల సమావేశాన్ని విజయవంతం చేయండి

జమ్మలమడుగు : ఈనెల 19వ తేదీన జరిగే బీసీ ఆత్మీయ సమావేశానికి బీసీ లందరూ హాజరై విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బడిగించల చంద్రమౌళి తెలిపారు. బుధవారం పెద్దముడియం మండలం సుద్దపల్లె, పెద్దముడియం, పాలూరు, గుల్లకుంట గ్రామాల్లో పర్యటించి బీసీల పెద్దలను సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. బీసీకులాలందరూ కలసికట్టుగాపోరాటం చేసి తమ న్యాయమైన కోరికలను సాధించుకోవచ్చు అని సూచించారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పేదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

స్టేట్ టెక్‌ఫెస్ట్‌లో కమలాపురం విద్యార్థుల ప్రతిభ


మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శివకవిత, లావణ్య

కమలాపురం : విజయవాడలో జరిగిన పాలిటెక్నిక్ రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌లో కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో చిలిచారు. కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ సెకండియర్ చదువుతున్న శివ కవిత, లావణ్య బృందం వృద్ధులకు మందులు ఇచ్చే పిల్డిస్పెన్సర్ ప్రాజెక్ట్‌ను తయారు చేసి స్టేట్ టెక్ ఫెస్ట్‌లో ప్రదర్శించారు. ఈ ప్రాజెక్ట్ స్టేట్ లెవెల్‌లో ద్వితీయస్థానంలో నిలిచింది. కాగా మంగళవారం విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన అభిజాత వేడుకలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా విద్యార్థినులు అవార్డు అందుకున్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ అద్భుత సాధనకు కళాశాల సిబ్బంది మునిశేఖర్ రెడ్డి, శివకుమారి, నాయకత్వం, మార్గదర్శనం, ప్రేరణ కారణంగా సాధ్యమైందన్నారు. తమ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందని ఆయన అన్నారు.

రేపు ముక్కోటి ఏకాదశి వేడుకలు


వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానంలో రేపు శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, ప్రధాన అర్చకులు హరిప్రవీణ్‌లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువ జామున 5 గంటల నుండి తిరుప్పావై స్వామి వారిని మేల్కొలిపి, ధనుర్మాస కైంకర్యాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం భక్తులకు వైకుంఠ ద్వార సర్వదర్శనానికి అనుమతిస్తారన్నారు. ఎద్దుల కొండపైకి వైకుంఠ ద్వార దర్శనార్థం వచ్చే భక్తులకు మెయిన్‌బజార్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయం దగ్గర నుండి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ముక్కోటి ఏకాదశి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

సింహాద్రిపురం : స్థానిక శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి దర్శనాన్ని ఉత్తర ద్వారంవైపు దర్శనభాగ్యం కల్పిస్తారని వారు తెలిపారు. ఉదయం పరత్యేక పూజలతోపాటు సాయంత్రం స్వామి వారిని రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని వారు కోరారు.

శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించండి

లింగాల : పార్నపల్లె గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు తమకు శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతి పత్రం అందించారు. బుధవారం మండలంలోని పార్నపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాలలో సర్వే నెంబరుల, భూవిస్తీర్ణం వంటి తప్పులను సవరించేందుకు రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ వాసులు తమకు శ్మశాన వాటిక స్థలం లేక తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నామని, తమ కాలనీలో 400 మంది జనాభా కలిగి ఉన్నామని, కాలనీ వాసులు మృతి చెందితే ఎక్కడ పూడ్చుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వంకలు, వాగుల వెంట వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వెటనే శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించి ప్రహరీ గోడను నిర్మింపజేయాలని కాలనీ వాసులు తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జయంతి


శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు

వేంపల్లె : విశ్వ నిర్మాణ శాస్త్రవేత్త స్టీఫెన్ విలియం హాకింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు పాన్నతోట గంగాధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్టీఫెన్ హాకింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక నారాయణ రెసిడెన్షియల్ స్కూలు ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్టీఫెన్ విలియం హ్యకింగ్ శాస్త్రవేత్త బ్లాక్ హోల్స్ కృష్ణ బిలాలకు సంబంధించి అనేక అంశాలకు పరిశోధనలు చేశారని, ఆయన గొప్ప సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త అని కొనియాడారు. ఆయన 21వ ఏటనే నాడీ వ్యవస్థకు సంబంధించిన జబ్బు విస్తరించి కొన్ని దశాబ్దాలకు శరీరం కదలని స్థితికి చేరుకుందని అట్టి పరిస్థితుల్లో కూడా శాస్త్ర సాంకేతిక పరిసరాల సహాయంతో కేవలం ఒక దవడ ఎముకతో తన భావాలు వ్యక్తం చేసేవారని తెలిపారు. అలా శరీరం కదలలేని స్థితిలో ఉండి కూడా ఆయన చేసిన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతించాయన్నారు. ఆయన రాసిన కాలం సంక్షిప్త కథ అన్న పుస్తకం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందన్నారు. మరణించే సమయానికి ఆయన క్రైమ్ బ్రిడ్జి విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ కాస్మోలజీ రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నారాయణ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు

సౌత్ ఇండియా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ప్రతిభ చూపిన విద్యార్థులతో హెడ్మాస్టర్, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సౌత్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ బి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాఠశాలకు చెందిన గౌరి శంకర్, సి.వి.ప్రసాద్‌లు మంచి ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఆడ బిడ్డలను బతకనిద్దాం

జమ్మలమడుగు : ఆడపిల్ల కడుపులో పెరుగుతుందని చాలా మంది అబార్షన్ చేయించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి వారికి వైద్యులు కౌన్సిలింగ్ ఇచ్చి సరైన మార్గంలో పెట్టాలని ఇన్‌చార్జి డిప్యూటీ వైద్యాధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలో రమేష్ సూపర్ స్పెషాలిటీ, సాయి నర్సింగ్ హోంలలో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్‌లు వైద్యులు కడుపులో పెరుగుతున్న బిడ్డల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవటానికి మాత్రమే ఉపయోగించాలే తప్ప లింగ నిర్ధారణ చేయకూడదని సూచించారు. ఎవరైనా లింగ నిర్ధారణ చేసినట్లు రుజువు అయితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. వివరించారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు పోటీలకు శరణ్యరెడ్డి జడ్జిగా వ్యవహరించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు పబ్బతి టెక్స్ టైల్స్, కేవీఆర్ ఫ్యామిలీ రెస్టారెంట్ వారు బహుమతులకు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

సింహాద్రిపురం : స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ హరిబాబు ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. బుధవారం నాటితో రెవెన్యూ సదస్సులు ముగిశాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్–15 విద్యార్థులు దత్తత గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమార్‌స్వామి గుప్తా తెలిపారు. బుధవారం దత్తత గ్రామమైన చక్రాయపేట మండలంలోని కుమార కాల్వ గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలోని పాఠశాల పరిసరాలలో చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే గ్రామంలోని ప్రజలతోపాటు ఆడపిల్లల చదువు యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కొండాపురం : స్థానిక సీఎంఆర్ కాంప్లెక్స్ బస్‌స్టాప్ సమీపంలోని తాడిపత్రి–కడప నాలుగు వరుసలజాతీయ రహదారిలో కారును టిప్పర్ ఢీ కొన్న ఘటన బుధవారం చోటుచేసుకొంది. రోడ్డు పనులకు చెందిన ఓ టిప్పర్ రోడ్డు తిప్పుకోబోయి డోన్ నుంచి తిరుపతికి వెళ్లే కారును ఢీ కొంది. కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపిల్చుకున్నారు. ఢీ కొన్న ఘటనలో కారు దెబ్బతింది.

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

వీరపునాయునిపల్లె : అంధ్రప్రదేశ్ రైతు సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం కొమ్మద్ది గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆవిష్కరించి మాట్లాడారు. ఏపీ రైతు సంఘం నిత్యం రైతులను చైతన్య పరుస్తూ వారి కొరకు వివిధ కార్యక్రమాలను రూపొందించడం అభినందనీయమన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొమ్మద్ది రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకుడు గురుప్రసాద్ నాయక్, ఏపీ వీఆర్ఏ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పారిశుద్ధ్య అధికారులు


గరుగు వీధిని పరిశీలిస్తున్న ఎంపీటీసీ పద్మా రాజ్‌కుమార్

వేంపల్లె : వేంపల్లె గ్రామంలో పారిశుద్ధ్య పనులను అధికారులు నిర్లక్ష్యంగా చేపట్టడంతో వీధులన్నీ చెత్త కుప్పలుగా మారిపోతున్నాయని ఎంపీటీసీ పద్మా రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం వేంపల్లెలోని గరుగువీధిలో అపరిశుభ్రతగా ఉన్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించి పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గరుగువీధిలో పారిశుద్ధ్య పనులు చేయకపోవడంతో రోడ్డంతా చెత్తతో నిండిపోయిందని, కాలువల్లో చెత్తను కూడా తొలగించకపోవడంతో కాలువలు కూడా చెత్తతో నిండి పోయాయన్నారు. చెత్త డబ్బాను సిబ్బంది తొలగించారని, కనీసం అ ప్రాంత ప్రజలు చెత్తను వేయడానికి చెత్త వాహనం కూడా అధికారులు పంపిచకపోవడం దారుణమన్నారు. చెత్త వాహనం గరుగువీధి ప్రాంతానికి వెళ్లకపోవడంతో చెత్తను ఇంట్లోనే రెండు, మూడు రోజులపాటు పెట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లి వేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీలో పదుల సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ పారిశుద్ధ్య మాత్రం మెరుగుపడటంలేదన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గరుగువీధిలో చెత్తను, కాలువలను శుభ్రం చేయడంతోపాటు ప్రతి రోజూ చెత్త వాహనం వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాగే పరిస్థితి నెలకొంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదు


ప్రజా వేదికలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో చిన్న చిన్న పొరపాట్లకు కూడా అవకాశం ఇవ్వరాదని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ తెలిపారు. వల్లూరు మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలు ఆయా గ్రామాల్లో తాము గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. అనంతరం అడిషనల్ పీడీ మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృందం గుర్తించిన ఒకే ఇంటిలో ఒకటి కంటే ఎక్కువగా వున్న జాబ్ కార్డులను తొలగించాలని ఆదేశించారు. కాగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో మొత్తం రూ 5,37,67,597 విలువ చేసే 744 పనులను చేపట్టగా అందులో 10 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంభందంచి రూ 17,672 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో రఘురాం, డీపీవో రామలింగా రెడ్డి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ కన్నారెడ్డి, ఏపీవోలు సుధారాణి, పార్థసారథి, సర్పంచులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

12 నుంచి సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శిల్పారామ ఏఓ సుధాకర్, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని, శిల్పారామం, వైఎస్సార్ ఉల్లిమెల్ల లేక్‌లో ఈనెల 12 నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు శిల్పారామ ఏఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానక శిల్పారామంలో ఆయన సంక్రాంతి సంబరాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిల్పారామంలో 12న చుక్కల ముగ్గులు పోటీలను నిర్వహిస్తామని. ముగ్గుల పోటీల్లో పాల్గొనదలిచిన వారు 12వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల్లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 13న భోగి మంటలు, ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు శ్రీ ఉపేంద్రచే ఇంద్రజాల ప్రదర్శన ఉంటుందన్నారు. 14న సంక్రాంతి పండుగ రోజున హరిదాసుల సంక్రాంతి ప్రదర్శన, గాలిపటాల ఎగురవేసే కార్యక్రమం, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గులు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 15న చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌లో

సంక్రాంతి సంబరాలలో భాగంగా స్థానిక వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌లో 13న భోగి మంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 14, 15వ తేదీలలో కూచిపూడి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సంబరాలలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో మహిళలకు ఉపాధి


మహిళలకు చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న పీడీ ఆనంద్‌నాయక్

ఎర్రగుంట్ల : మహిళలకు చేపల పెంపకంతో ఉపాధి లభిస్తుందని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో కొరమీన చేపల పెంపకంపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేపల పెంపకంతో నెలకు రూ.10 వేలు ఆదాయం మహిళ రైతులకు వస్తుందన్నారు. తర్వాత ఆక్వాకల్చర్ ఎండీ పీహెచ్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక రైతు ఎకర భూమిలో పది సెంట్లలో చేపల పెంపకం చేసుకోవాలన్నారు. ఇలా ఏడాదికి మూడుసార్ల దిగుబడి వస్తుందని దీని వల్ల సంవత్సరానికి రూ.2 లక్షలు వస్తుందన్నారు. ఈ అవకాశంను పొదుపు సంఘాలలో మహిళలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జగదీశ్వరీమ్మ, తదితరులు పాల్గొన్నారు.